ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 13-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- నీట్ యూజీ-2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణలకు సంబంధించిన కేసులో సీబీఐ ఐదుగురు నిందితులను అరెస్టు చేసింది.
- బంగారం, వెండి, ఇతర విలువైన లోహాలపై కేంద్ర ప్రభుత్వం పెంచిన 15 శాతం దిగుమతి సుంకం ఈరోజు నుండి అమలులోకి వచ్చింది.
- బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం న్యూఢిల్లీ వేదికగా రేపటి నుంచి రెండు రోజుల పాటు జరగనుంది.

========================

ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2026-27 మార్కెట్ సీజన్‌కు సంబంధించి వరితో పాటు 14 పంటలకు కనీస మద్దతు ధర పెంపుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ అంగీకారం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన న్యూ ఢిల్లీలో ఈరోజు జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు కేబినెట్ వివరాలను వెల్లడిస్తూ... రైతులకు లాభదాయకమైన ధరలు అందేలా చూసేందుకు ప్రభుత్వం ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను పెంచిందన్నారు. వీటి కోసం సుమారు 2 లక్షల 60 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నామని తెలిపారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్‌కు 824 లక్షల మెట్రిక్ టన్నుల పంటను సేకరిస్తామని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

అదేవిధంగా క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంపొందించడంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం 37,500 కోట్ల రూపాయల మేర ప్రోత్సాహక పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ-2026 పరీక్షా పేపర్ లీక్ ఆరోపణలకు సంబంధించిన కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఈరోజు ఐదుగురు నిందితులను అరెస్టు చేసింది. ఈ కేసులో జైపూర్‌కు చెందిన ముగ్గురు, గురుగ్రామ్‌కు చెందిన ఒకరు, నాసిక్‌కు చెందిన ఒకరు ఉన్నారు. ఈ ఐదుగురు నిందితులతో పాటు పలువురు ఇతర అనుమానితులను సీబీఐ ప్రస్తుతం విచారిస్తోంది. కొత్తగా వెలుగులోకి వస్తున్న ఆధారాల మేరకు ఈ రోజు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దర్యాప్తు సంస్థ సోదాలు నిర్వహించింది. ఈ సోదాలు, అరెస్టుల సందర్భంగా నేరానికి సంబంధించిన పలు సామాగ్రి, మొబైల్ ఫోన్లతో సహా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ప్రాథమిక విచారణ జరిపిన రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌తో కూడా ఈ సంస్థ సమన్వయం చేసుకుంటోంది. కాగా వైద్య కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ) 2026 పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిందనే ఆరోపణల నేపథ్యంలో పరీక్షను నిన్న రద్దు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి, ఇతర విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని పెంచింది. బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి పెంచుతూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈరోజు ఆదేశాలు జారీ చేసింది. బంగారం, వెండి ముడి పదార్థాలపై 5 శాతం సుంకం, ప్లాటినం ముడి పదార్థాలపై 5.4 శాతం సుంకం విధిస్తామని తెలిపింది. దీంతో వీటిపై 10 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ, 5 శాతం అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ (ఏఐడీసీ) విధించారు. దీంతో మొత్తం దిగుమతి సుంకం 15 శాతానికి చేరింది. ఇది ఈరోజు నుండి అమలులోకి వచ్చింది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో బంగారం కొనుగోలును ఏడాది పాటు తగ్గించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పౌరులకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే బంగారం అత్యధికంగా దిగుమతి చేసుకొనే రెండో దేశం భారత్ కాగా.. వెండి దిగుమతిలో మొదటి స్థానంలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం న్యూ ఢిల్లీ వేదికగా రేపటి నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో సభ్య, భాగస్వామ్య దేశాల బ్రిక్స్ విదేశాంగ మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు పాల్గొంటారు. ఇప్పటికే పలు సభ్య దేశాల మంత్రులు భారత్ చేరుకున్నారు. అందులో చిలీ విదేశాంగ మంత్రి ఫ్రాన్సిస్కో పెరెజ్ మెకెన్నా, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రొనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరాలు ఉన్నారు. వీరందరూ జైశంకర్ తో ఈరోజు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. బ్రిక్స్ సమావేశం అనంతరం  వీరందరూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా కలుస్తారు. బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు పరస్పర ఆసక్తి ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకుంటారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దేశ పౌరులు వృథా ఖర్చులు తగ్గించుకుని ఇంధన పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ మేరకు అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని ప్రధానమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (SPG)కి నరేంద్ర మోదీ సూచించారు. అలాగే విద్యుత్ వాహనాల (EVs) వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు.

ప్రధానమంత్రి పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన కాన్వాయ్‌ల సంఖ్యను సగానికంటే తక్కువకు కుదించారు. అలాగే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సహా ఇతర కీలక నాయకులు కూడా తమ అధికారిక భద్రతా కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులో సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం (టీవీకే) ప్రభుత్వం శాసనసభలోని తన బలాన్ని నిరూపించుకుంది. ఈరోజు జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించింది. 144 మంది శాసనసభ్యులు విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయగా, 22 మంది సభ్యులు విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే పార్టీ సభా కార్యకలాపాలు జరుగుతుండగా వాకౌట్ చేసింది. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు మద్దతిచ్చాయి. పలువురు అన్నాడీఎంకే పార్టీ ఎమ్మెల్యేలు కూడా విజయ్ అనుకూలంగా ఓటేశారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ కేవలం 108 సీట్లను మాత్రమే దక్కించుకోవడంతో, సభలో తమ మెజారిటీని నిరూపించుకోవాలని తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ విజయ్‌ను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 12వ తరగతి పరీక్షల ఫలితాలను ఈరోజు విడుదల చేసింది. ఫిబ్రవరి 17 నుంచి ఏప్రిల్ 10 వరకు జరిగిన ఈ పరీక్షలకు దేశ వ్యాప్తంగా సుమారు 17 లక్షల 68 వేల మందికి పైగా విద్యార్థులు హాజరు కాగా.. 15 లక్షల 7 వేల మందికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని సీబీఎస్ఈ ఒక ప్రకటనలో పేర్కొంది. తాజాగా వెలువడిన ఫలితాల్లో 85.20 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో బాలికల ఉత్తీర్ణత శాతం 88.86 కాగా, బాలుర ఉత్తీర్ణత శాతం 82.13 శాతంగా ఉందని తెలిపింది. 17 వేల మంది విద్యార్థులు 95 శాతానికి పైగా స్కోర్ చేయగా, 94 వేల మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 15వ తేదీ నుండి ఆరు రోజుల పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలలో దేశాలలో పర్యటించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ పశ్చిమ కార్యదర్శి సి బి జార్జ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి 15వ తేదీన యూఏఈకి చేరుకుంటారని, ఆ దేశ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తో భేటీ అవుతారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 559 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమై.. చివరికి 49 పాయింట్ల లాభంతో 74 వేల 608 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 33 పాయింట్లు లాభపడి 23 వేల 412 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 71 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో

విమానాలను నిలిపివేస్తున్నట్లు ఈరోజు ప్రకటించింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే మార్గాల్లో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాయపూర్ వేదికగా ఈరోజు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరగాల్సిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యమైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =